పింఛను తొలగించారయ్యా..!

- అనర్హుల సాకుతో అర్హులైన అంధుల పింఛన్లు తొలగించిన కూటమి
- రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులకు అన్యాయం
- 10 ఏళ్ల నుంచి పింఛను తీసుకునే వారి పేర్లు సైతం తొలగింపు
- గుడ్డిగా నోటీసులిచ్చిన అధికారులు



పింఛను కోసం ఎంపీడీవో కార్యాలయం వద్దకు వచ్చిన అంధులు (ఫైల్)

వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పుట్టు గుడ్డివాళ్లు, కళ్లు పోగొట్టుకున్న అంధుల పింఛన్లను గుడ్డిగా తలగించడంతో పింఛన్లు ఆగిపోయిన బాధితులు ఆవేదన చెప్పనలవి కావడం లేదు. అనర్హులు పింఛన్లు అక్రమంగా పొందుతున్నారని రీవెరిఫికేషన్ పేరుతో అర్హులైన వారిపేర్లు కూడా తొలగించడం గమనార్హం. తొలగించిన అంధులు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ 'తమకు న్యాయం చేయండి' అంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్న వారి వేదన వర్ణనాతీతంగా ఉంది. వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం, పెద్దకంచర్ల, రామిరెడ్డిపాలెం, గ్రామాలతోపాటు పలు గ్రామాలల్లో అంధులు పింఛన్లు తొలగించడంతో ఎంపీడీవో కార్యాలయాలని చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. 10, 15 ఏళ్లనుంచి పింఛన్లు తీసుకునేవారి పేర్లను అధికారులు తొలగించడం విమర్శలకు దారితీసింది. వినుకొండ రూరల్ మండలం గోకనకొండకు కిచెందిన రావులపల్లి గోవిందరాజులు, తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన మార్లెళ్ల శకుంతల, పెదకంచర్లకు చెందిన ఉన్నగిరి అపర్ణ, వంకాయలపాటి దుర్గ, చీకటీగలపాలెం గ్రామానికి చెందిన ఇసిరెడ్డి అచ్చెమ్మలతోపాటు పలువురు అనేక కేటగిరీలకు చెందిన వికలాంగుల పింఛన్లు ప్రభుత్వం తొలగించింది. కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి మరీ స్థానిక నాయకుల వత్తిడి మేరకే అధికారులు పింఛన్లను తొలగించడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్థానిక అధికారులు సమస్యను గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల పేరుతో కుట్ర



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనర్హుల పింఛన్లు తీసుకుంటున్నారనే సాకుతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లు మాత్రమే తొలగించేందుకు కుట్ర చేసింది. అనర్హులు పింఛన్లు తీసుకుంటే తొలగించడం అభ్యంతరం లేదు. అనర్హుల పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభు త్వం వాస్తవాలు తెలుసుకుని తొలగించిన అర్హులైన వారికి పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి. లేనిపక్షంలో బాధితుల తరపున పోరాటం చేస్తాం

–పగడాల వెంకట్రామి రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత

10 ఏళ్ల నుంచి తీసుకుంటున్నా!



నేను 10 ఏళ్లనుంచి వికలాంగుల పింఛను తీసుకుంటున్నా. అయితే అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారనే కారణంలో గుడ్డివాడినైన తన పింఛను కూడా తీసివేశారు. గతంలో 85 శాతం ఉన్నప్పటికీ రీవెరిఫికేషన్ పేరుతో మళ్లీ పరీక్షలు చేసి 40 శాతం అంగవైకల్యం ఉందని చూపించి పింఛను తొలగించారు. పింఛను మీదనే ఆధారపడిన మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. –రావులపల్లి గోవిందరాజులు, గోకనకొండ

అర్హత ఉన్నా తొలగించారు



నాకు చిన్నతనం నుంచి ఒక కన్ను కన్పించదు. అయితే గత పదేళ్ల నుంచి పింఛను తీసుకుంటున్నా. పింఛను పొందేందుకు అన్నీ అర్హతలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పింఛన్లు తొలగించడం దారుణం. ఇప్పటికైనా స్పందించి పింఛన్లు మళ్లీ పునరుద్ధరించాలి.

–ఉన్నగిరి అపర్ణ, పెదకంచర్ల

కావాలనే తొలగించారు



మాది వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం గ్రామం. గత ఆరేళ్లుగా వికలాంగుల కోటాలో రూ.6 వేలు పింఛను తీసుకుంటున్నా. కేవలం కావాలనే కొంతమంది స్థానిక నాయకుల జోక్యంతో పింఛన్లు తొలగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తొలగించిన పింఛను మంజూరు చేయాలి.

–ఇసిరెడ్డి అచ్చమ్మె, చీకటీగలపాలెం

క్లుప్తంగా

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా శాఖ తీర్మానించింది. సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ ఆర్కే ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేద కళాకారులను ఆదుకోండి

వినుకొండ: హరికథలు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్న హరికథ భాగవతారణి సిద్దు నాగ మల్లేశ్వరి ఇల్లు లేక, హరికథలకు ఆదరణ లేక జీవన భృతి కష్టంగా ఉందని గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కలిసి విన్నవించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ కళాకారులను అన్నివిధాలుగా ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడి కళాపీఠం అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నూజెండ్ల: అక్రమ ఎరువుల నిల్వలు కలిగి ఉంటే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్లలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం తహసీల్దార్ రమేష్ కుమార్, వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, గోదాముల తనిఖీలు చేశారు. యూరియా కొరతను సద్వినియోగం చేసుకున్న కొందరు విక్రయదారులు బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. అనుమతులు లేని బయో ఉత్పత్తులు విక్రయాలు జరిపిన, అక్రమ ఎరువుల నిల్వలు చేసినా చర్యలు చేపట్టనున్నట్లు డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎలీషా ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

వినుకొండ: రాజయోగిని ప్రకాశమణి దాది 18వ వర్ధంతి సందర్భంగా బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని రాధాడిగ్రీ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, యువకులు, మానవ సేవాసమితి సభ్యులు మొత్తం 50 మంది రక్తదానం చేశారు. సమితి అధ్యక్షులు పి.వి.సురేష్ బాబు 92వసారి రక్తదానం చేయడం జరిగిందని, రక్తదానం చేసిన వారందరినీ అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ ప్రసాద్, బ్రహ్మకుమారి సమాజం నిర్వాహకులు బీకే రాధిక, బీకే రమాదుర్గ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయం



చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ చెప్పారు. మోడరన్ స్టెల్లార్ స్కూల్ బాలికల జట్టు గుంటూరు ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో జాతీయ, అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఏదో క్రీడలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల సిబ్బంది ప్రత్యూష, విజయలక్ష్మి, ప్రసూన, నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో ధనలక్ష్మి వ్యాయమా కళాశాల్లో ఈనెల 29న మేజర్ ధ్యానచంద్ జన్మదిన వేడుకలు సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల అంశాలతో పాటు క్రీడా పోటీలను సోమవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు అదేరోజున బహుమతులు ధ్రువీకరణ పత్రాలు మెడల్స్ ప్రదానోత్సవం కళాశాల కరస్పాండెంట్ సెక్రటరి మేదరమెట్ల రామశేషగిరి చేతుల మీదగా అందజేస్తారన్నారు. ఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బలరాం నాయక్, అరవింద్, సాయిప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నరసరావుపేట: చిలకలూరిపేట రోడ్డులోని ముస్లింల ఏకైక ఖబరస్థాన్‌లోని సమస్యలు పరిష్కరించి వెంటనే వాడుకలోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం ద్వారా ఖబరస్థాన్ పరిస్థితి వెలుగులోకి వచ్చిందన్నారు. గత ఆదివారం ఖబరస్థాన్‌ను సందర్శించారని, దాని పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పురపాలక నిధులతో అధికారులు, సిబ్బంది ఖబర్‌స్థాన్ అభివృద్ధికి పాటుపడ్డారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కన్పించటం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు స్పందించి ముస్లింల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాషు, షేక్ శిలార్‌బాషు, వలీమేస్త్రి, షబ్బీర్, సయ్యద్ జాఫర్, పెద్దబుజ్జి, ఖాజా, మహమ్మదా, అబూబకర్, నాగూర్ సైదా, సుభాని పాల్గొన్నారు.

నేత్రదానంపై ప్రతి గ్రామంలో ప్రచారం చేస్తాం

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, వైద్యశాఖ అధికారులు



నేత్రదానం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వైద్యశాఖ అధికారులు

నరసరావుపేట: ప్రజలలో నేత్రదానం ప్రాముఖ్యత గురించి ప్రతి గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ప్రచారం చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. ఎవరైనా మృతిచెందిన తర్వాత ఆరు గంటల్లోపు, మార్చ్యురీ బాక్స్‌లో మృతదేహం ఉంచితే 10 గంటల్లోపు సమీపంలోని ఐ.బ్యాంకుకి సమాచారం తెలిపి నేత్రదానం చేయవచ్చునని డాక్టర్ రవి వెల్లడించారు. జిల్లాలో మొత్తం 60 కార్నియాలు (నల్లగుడ్డు) నేత్రదానం చేయడానికి ప్రోత్సాహం చేసిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగికి సంద్రపాటి చలపతిరావు కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ప్రసూన, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, మర్లపాటి రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై చర్య తీసుకోవాలంటూ ధర్నా



బాధితుడితో ప్రజా, కుల సంఘాల నాయకులు

నరసరావుపేట: విద్యుత్ తీగెలు తొలగించేందుకు స్తంభం ఎక్కించి విద్యాదాఘాతానికి గురై అంగవైకల్యానికి కారణమైన లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌పై చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని ప్రజా, కుల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు బాధితులతో ధర్నాచేసి పీజీఆర్ఎస్ సమావేశంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 2023 జూన్ 14న కారంపూడి మండలం పెద కోదంగుండ్ల గ్రామానికి చెందిన లైన్‌మెన్ ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మాచారి గ్రామంలో వెంకటేశ్వరస్వామి రథోత్సవం జరుగుతుందని, 11 కె.వి విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించమని ప్రైవేటుగా కరెంటు పనులు చేసే వర్ల సాగర్‌బాబుని కరెంటు స్తంభం పైకి ఎక్కించారన్నారు.

తీగలు తప్పించే ప్రయత్నం చేస్తుండగా సాగర్ బాబు విద్యుదాఘాతానికి గురై అక్కడి నుంచి కింద పడి ప్రాణాపాయ స్థితికి చేరాడన్నారు. పూర్తిగా వికలాంగుడైన తర్వాత ఇప్పుడు మా వల్ల కాదని చేతులెత్తేశారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, బాబు జగజీవన్ రామ్ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.సురేంద్రబాబు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

బేకరీలో నగదు చోరీ

- సీసీ పుటేజ్‌లో లభ్యమైన చోరీ దృశ్యాలు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు



బేకరీ క్యాష్ కౌంటర్‌లో నగదు అపహరిస్తున్న దుండగుడు


నరసరావుపేట టౌన్: షట్టర్ తాళాలు పగులగొట్టిన దుండగుడు బేకరీలోకి ప్రవేశించి కౌంటర్‌లో నగదు అపహరించుకు వెళ్లిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సంఘటనలో రూ.1.50 లక్షల నగదు అపహరణకు గురైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లమ్మ సెంటర్ సమీపంలోని బేకరీ మార్ట్ నిర్వాహకుడు హర్షవర్ధన్ దుకాణాన్ని రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి తాళాలు వేసి వెళ్లాడు. సోమవారం ఉదయం బేకరీ తెరిచేందుకు వచ్చి చూసేసరికి షట్టర్ తాళాలు పగులగొట్టబడి ఉన్నాయి. కౌంటర్‌లో ఉండవలిసిన నగదు సుమారు రూ.1.50 లక్షలు కనిపించలేదు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బేకరీలో ఉన్న సీసీపుటేజ్‌ను పరిశీలించారు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో షట్టర్ తాళాలు పగుల గొట్టిన దుండగుడు బేకరీలోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో నగదు అపహరించుకు వెళ్లిన దృశ్యాలు సీసీ పుటేజ్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేయాలి

నరసరావుపేట: ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో 65 నుంచి 70 శాతం వరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారని, అటువంటి కౌలు రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాధాకృష్ణ విమర్శించారు. ఈ మేరకు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల పట్ల చిన్న చూపు చూస్తున్నాయని వారి గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కోశాధికారి డి.శివకుమారి, కౌలు రైతు సంఘం నాయకులు కోంద్రు ఆంజనేయులు, అమరలింగేశ్వరరావు, జి.పిచ్చారావు, టి.హనుమంతరావు అధిక సంఖ్యలో కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత పంచాయతీ అధికారులదే

యడ్లపాడు: గ్రామీణప్రాంతాల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఎడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఇంచార్జి ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ కమిటీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల లీడర్లు హాజరయ్యారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ సుందర్రావు, ఏపీఎం రవీంద్ర, అసిస్టెంట్ స్టాఫ్ అనిల్‌కుమార్, నజీర్‌బాజీ, రిసోర్స్ పర్సన్స్ అయిన సి.హెచ్.బోల్లయ్య తదితరులు పాల్గొన్నారు. వ్యర్థాల నిర్వహణ ద్వారా వ్యర్థాల నుంచి సంపదను సృష్టించవచ్చని అధికారులు తెలియజేశారు.



పూజలు అందుకోనున్న బాలాపూర్ గణేష్



శ్రీరాంపురంలో ముస్తాబవుతున్న చవితి పందిరి



గ్రామానికి తరలిస్తున్న గణనాథుడు

భారీ సంఖ్యలో చవితి పందిళ్లు

- గ్రామాలకు తరలి వెళుతున్న గణనాథులు
- రేపు వినాయక చవితి పూజలు



ఎన్టీఆర్ కాలనీ వద్ద వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

నరసరావుపేట ఈస్ట్ / యడ్లపాడు: చవితి పూజలకు పట్టణం ముస్తాబైంది. ఎటువంటి విఘ్నములు కలగకుండా విఘ్నేశ్వరునికి పూజలందించేందుకు పట్టణంలోని వివిధ కూడళ్లలో చవితి పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రతి వీధిలోనూ ఒకటి రెండు పందిళ్లు ఉన్నాయా అన్నంతగా ఈ ఏడాది అధిక సంఖ్యలో పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి తోడు ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ గణనాథుడిని పూజించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాకుమానువారి వీధి, శ్రీరాంపురం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ గణేశుడు పూజలందుకునేందుకు ముస్తాబవుతున్నాడు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి పట్టణంలోని పందిర్లతో పాటు సమీప గ్రామాలకు తరలి వెళుతున్నాయి. ట్రాక్టర్లు, లారీలు, ట్రాలీ ఆటోలతో తరలి వచ్చిన భక్తులు తాము ఎంచుకున్న గణపయ్య విగ్రహాలతో డీజే సౌండ్స్‌తో గ్రామాలకు వెళుతున్నారు.

విగ్రహాల సందడి

యడ్లపాడు మండలంలో వినాయక చవితికి మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, వీధివీధిన గణపయ్యలను ప్రతిష్ఠించడానికి మండపాల ఏర్పాటు పనులు వేగవంతం అయ్యాయి. చాలా కమిటీలు భారీ విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాయి. రాజస్థాన్, కోల్‌కతా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పట్టణం, మండల కేంద్రాలకు సమీపంలో నెలల కిందటే మకాం వేసి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. కళాత్మకమైన, విభిన్న ఆకృతుల్లో రూపొందించిన విగ్రహాలకు ఆకర్షణీయమైన రంగులు అద్దుతున్నారు.

విగ్రహాల రూపాలు, ధరలు

ఈసారి ద్విముఖం, త్రిముఖం, పంచముఖం, పార్వతీ పరమేశ్వరులు, రాముడు, శ్రీకృష్ణునితో పార్వతీతనయుని కొలువుదీర్చిన విగ్రహాలు, కాణిపాకం వినాయకుడిలా, క్షీరసాగరాన, నెలవంకపై పవళించిన భంగిమల్లో గజాననుడిని విభిన్న రూపాల్లో పాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను తయారు చేశారు. ఆయా విగ్రహాలను 4 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు కలిగిన విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విగ్రహాలు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతున్నాయి. చాలా మంది ఇప్పటికే తమకు నచ్చిన విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చి అడ్వాన్సులు చెల్లించారు. కొందరు తమకు కావలసిన డిజైన్లను, రంగులు చెప్పి ప్రత్యేకించి తయారు చేయించుకుంటున్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఊరేగింపుగా గణనాథులను మండపాలకు తరలించే ప్రక్రియ మొదలవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు

ఆన్‌లైన్‌లోనే అనుమతులు



వినాయక ఉత్సవాలకు అనుమతుల కోసం ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా 'గణేష్ ఉత్సవ్.నెట్' అనే వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఉత్సవ కమిటీలు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్‌విండో విధానంలో ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందోచ్చు. ఈ అనుమతులకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తు అనంతరం పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ ఉన్న నిరభ్యంతర పత్రాన్ని ఇస్తారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి.

–బి సుబ్బానాయుడు, చిలకలూరిపేట రూరల్ సీఐ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రొంపిచర్ల: మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారితో కూడిన సమన్వయ అధికారుల బృందం తనిఖీలు చేసింది. స్టాక్ రిజిస్టర్‌లతో ఈపీవోఎస్ సిస్టమ్స్ ఆధారంగా ఎరువుల నిల్వలను సరిచూశారు. అలాగే ఇతర మండలాల రైతులకు యూరియా బస్తాలను విక్రయించ వద్దని సూచించారు. అలాగే ప్రతి రైతుకు ఈపీవోఎస్ ద్వారానే యూరియాను విక్రయించాలన్నారు.

పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి

నరసరావుపేట: గత నలభై ఏళ్లుగా స్థానిక ఎస్ఎస్పీ కాలనీలో నివాసముంటున్న 62 కుటుంబాలకు నివాస స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించిన తర్వాతనే వారిని అక్కడి నుంచి తరలించాలని కుల నిర్మూలనా పోరాట సమితి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమం, మాలమహానాడు ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షులు బోరుగడ్డ అంబేద్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ అరుణ్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం ప్రజాసంఘాల నాయకులు మీడియాతో మాట్లాడారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రొంపిచర్ల డీఈ కార్యాలయాన్ని నరసరావుపేటలోనే ఉంచండి

రొంపిచర్ల: మండల విద్యుత్ డీఈ కార్యాలయాన్ని నరసరావుపేట డివిజన్ పరిధిలోనే ఉంచాలని సీపీఎం పార్టీ నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. రొంపిచర్ల విద్యుత్ డీఈ కార్యాలయం పరిధిలో రొంపిచర్ల, ఈపూరు, శావల్యాపురం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. అయితే డీఈ కార్యాలయాన్ని చిలకలూరిపేట డీఈ ఆఫీస్ పరిధిలోకి బదిలీ చేశారు. దీంతో ఈ మండలాల్లో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు ఏ అవసరం వచ్చినా 40 కిలోమీటర్ల దూరంలోని చిలకలూరిపేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నరసరావుపేట రూరల్ పరిధిలో ఉన్న నాలుగు మండలాలను చిలకలూరిపేట పరిధిలోకి మార్చటం సరైనది కాదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు కూడా వివరిస్తామని నాయకులు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి స్పందనలో అర్జీ అందజేస్తామన్నారు. ఈ మార్పును నిలుపుదల చేసి యధావిధిగా ఉంచకపోతే విద్యుత్ వినియోగదారులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేయడానికైనా వెనుకాడమని సీపీఎం మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, నాయకులు హెచ్చరించారు.